క్లుప్తంగా

విద్యాదీవెనతో విద్యార్థులకు ఆర్థిక భరోసా


చెక్కు అందజేస్తున్న ఎంపీపీ కడప లక్ష్మి

గిద్దలూరు రూరల్: జగనన్న విద్యాదీవెనతో విద్యార్థుల భవిష్యత్ ఆర్థిక భరోసా లభిస్తుందని ఎంపీపీ కడప లక్ష్మి అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం జగనన్న విద్యాదీవెన కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని విద్యార్థులకు నాలుగో విడత నిధులకు చెందిన చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జగనన్న ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్ కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందన్నారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌ను సాధించాలని ఆమె కోరారు. నియోజకవర్గంలోని 5575 మంది విద్యార్థులకు రూ.3,51,06,847 విడుదల చేయనున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి షేక్ జబ్బర్ తెలిపారు. మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, వార్డెన్లు బాబూరావు, ప్రభాకర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, అంజిరెడ్డి, రోజా పాల్గొన్నారు.

ఇంటింటికీ చెత్త బుట్టల పంపిణీ

దొనకొండ: స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్ ఆధ్వర్యంలో ఇంటింటికీ చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. సుమారు 500 చెత్త బుట్టలు వలంటీర్ల ద్వారా పంపిణీ చేశారు. మిగిలిన వారికి రెండు రోజుల్లో పంపిణీ చేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి తెలిపారు. వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ

గిద్దలూరు రూరల్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో స్థానిక ఎస్‌ఐ వి.మహేష్ మండలంలోని రౌడీషీటర్లకు శుక్రవారం పోలీసుస్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రజాజీవన విధానానికి ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడటంతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్ల జాబితాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ సక్రమ జీవన విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎటువంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్త పడాలన్నారు.

32 మద్యం బాటిళ్ల స్వాధీనం


మద్యం బాటిళ్లు చూపుతున్న ఏఎస్‌ఐ

ముండ్లమూరు: మండలంలోని వేంపాడు గ్రామానికి చెందిన యడ్లపల్లి వేణుగోపాలరావు నుంచి 32 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు. వేణుగోపాలరావు ఇంట్లో అక్రమంగా మద్యం ఉన్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం ఆయన తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. దాడిలో అతని వద్ద నుంచి 32 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకి హాజరు పరచనున్నట్లు ఏఎస్‌ఐ పవన్ కుమార్ తెలిపారు.

'చెకుముకి'లో అరవింద పాఠశాల విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం టౌన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో మార్కాపురం పట్టణంలోని అరవింద పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం పొందినట్లు కరస్పాండెంట్ సి.వాణి రాధాకృష్ణ శుక్రవారం తెలిపారు. వై.దినేష్, ఎస్.నాగచైతన్య, కె.అలేఖ్యలు బహుమతులు పొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు.

ఎస్‌ఐగా ఎంపికైన వాసవి కళాశాల విద్యార్థి

కంభం: పట్టణంలోని వాసవీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్న అర్ధవీడు మండలం గన్నెపల్లెకు చెందిన షేక్ ఖాశింవలి ఈ నెల 22వ తేదీన వెలువడిన ఎస్‌ఐ పోటీ పరీక్షల్లో 243 మార్కులు సాధించి ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. ఖాశింవలిని వాసవీ డిగ్రీ కళాశాల అధినేత గోళ్ల సుబ్బరత్నం శుక్రవారం ఘనంగా సత్కరించాడు. తమ కళాశాలలో చదివి మంచి స్థాయిలో నిలిచినందుకు అతడిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ కూన రాము, అధ్యాపకులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

అర్ధవీడు (కంభం): ఆటోను తప్పించబోయి ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పొలం గట్టుపైకి వెళ్లిపోయిన ఘటన శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కంభం నుంచి అర్ధవీడు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మోహిద్దీన్‌పురం మూల మలుపు వద్ద ఎదురుగా ఉన్న ఆటోను తప్పించబోయి గెట్టుపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఒకరిద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. జేసీబీ సాయంతో బస్సును వెనక్కి లాగారు.

ఉత్కంఠగా క్రీడా సమరం


గిద్దలూరు: ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు


బేస్తవారిపేట: క్రికెట్ ఆడుతున్న యువకులు


కురిచేడు: కబడ్డీ ఆడుతున్న యువకులు


కంభం: క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న సర్పంచ్ బోడయ్య


కలుజువ్వలపాడులో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు


మార్కాపురంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు


వేములకోటలో కబడ్డీ ఆడుతున్న మహిళలు


గొట్లగట్టులో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు


తూర్పుగంగవరంలో వాలీబాల్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగమణి

బేస్తవారిపేట: మండలంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నాలుగో రోజు ఉత్సాహంగా జరిగాయి. మండలంలోని 16 సచివాలయాల పరిధిలో పోటీలు నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో యువతీ, యువకులు పాల్గొన్నారు. పిటికాయగుళ్ల జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జరిగిన పోటీలను ఎంపీడీఓ పార్వతి, పూసలపాడులో జరిగే పోటీలను ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి పరిశీలించారు.

కురిచేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న పోటీల్లో యువకులు పోటీపడి ఆటలాడుతున్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో లాంటి ఆటలు ఆడుతూ వారిలోని క్రీడానైపుణ్యాలనువెలికితీస్తున్నారు. తమకు ఏ ప్రభుత్వమూ ఇవ్వని అవకాశాన్ని గ్రామస్థాయి నుంచి సద్వినియోగం చేసుకుంటున్నారు. శుక్రవారం యువకులు ఉత్సాహంగా కబడ్డీ ఆటలో పాల్గొన్నారు.

దర్శి: మండలంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా కొనసాగింది. విద్యార్థులు పోటీతత్వంతో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. బాలికలు, బాలురకు విడివిడిగా పోటీలు నిర్వహించారు. క్రీడలను తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: ఆడుదాం ఆంధ్రా ద్వారా క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చని ఎంపీపీ కందుల వెంకటయ్య అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు సచివాలయాల పరిధిలో శుక్రవారం క్రీడల పోటీలు నిర్వహించారు. పుల్లలచెరువులో షటిల్‌బాల్ పోటీలను ఎంపీపీ వెంకటయ్య ప్రారంభించారు. మండల ఉపాధ్యక్షుడు ఎల్. రాములు, నాయుడుపాలెం, మానేపల్లి సర్పంచ్ కోటిరెడ్డి, రమణారెడ్డి, తహసీల్దార్ దాసు, ఎంపీడీవో మరియదాసు, ఎంఈవో శామ్యూల్‌జాన్, ఇందిరాప్రసాద్, కార్యదర్శి బాలునాయక్‌లు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంబవరం, ఉయ్యాలవాడ, గడికోట, ఓబులాపురం, ముండ్లపాడు, కొమ్మునూరు, కొత్తకోట, సంజీవరాయుడుపేట గ్రామాల్లో శుక్రవారం ఆటల పోటీలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. నగర పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో పట్టణంలోని ఆదర్శ బీఈడీ కళాశాల ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి క్రీడలు నిర్వహించారు. ఈఓఆర్డీ చెన్నారావు, కార్యదర్శులు బూతేశ్వరరెడ్డి, రాఘవరావు, సుబ్బారావు, నాగసుధ పాల్గొన్నారు.

కంభం: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని కంభం సర్పంచ్ పల్నాటి బోడయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ఇదో చక్కటి అవకాశం అన్నారు. క్రీడా కారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శి బ్రహ్మయ్య, వెంకటేశ్వరరెడ్డి, స్టూడెంట్ విభాగం జిల్లా జాయింట్ సెక్రటరీ వేశపోగు మధు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఎస్‌వీకేపీ కళాశాల ఆవరణలో, ఇండోర్ స్టేడియం, సచివాలయాల పరిధిలో శుక్రవారం జవహర్ నగర్-2 సచివాలయం పరిధిలో యువతీ యువకులు క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాలీబాల్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలను మున్సిపల్, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

మార్కాపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో క్రీడా పోటీలను ఎంపీడీఓ తోట చందన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం అని పేర్కొన్నారు. వేములకోట గ్రామ సచివాలయం పరిధిలో మహిళలు ఉత్సాహంగా వాలీబాల్, కబడ్డీ ఆటలు ఆడారు. ఇడుపూరు గ్రామ సచివాలయ పరిధిలో యువత కబడ్డీ పోటీలో పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలో అన్నీ గ్రామ సచివాలయాల పరిధిలో క్రికెట్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించగా యువతీ యువకులు హోరాహోరీగా ఆడారు. పోటీలను ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ షాజిదా, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ ఆక్కిదాసరి ఏడుకొండలు, సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, కామసాని వెంకటేశ్వరరెడ్డి పర్యవేక్షించారు.

తర్లుపాడు: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రాలో భాగంగా క్రికెట్, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. పోటీలను తహసీల్దార్ అబ్దుల్ హమీద్, ఎంపీడీఓ నరసింహులు, స్థానిక సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు. మండలంలోని కలుజువ్వలపాడు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మేకలవారిపల్లి, లక్ష్మక్కపల్లి, కలుజువ్వలపాడు టీమ్‌ల మధ్య క్రికెట్ పోటీలను స్థానిక సర్పంచ్ శిఖామణి, వైస్ సర్పంచ్ దాస్, ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, నాయకులు మందా కొండారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు.

తాళ్లూరు (ముండ్లమూరు): ఆడుదాం... ఆంధ్రా ఆటల పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని తూర్పు గంగవరం సర్పంచ్ చాట్ల నాగమణి తెలిపారు. మండలంలోని తూర్పుగంగవరం హైస్కూల్లో శుక్రవారం ఆడుదాం.. ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా వాలీబాల్ పోటీలను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఆటలపై మక్కువ ఉన్న సామాన్య ప్రజలు పోటీల్లో పాల్గొనడం జగనన్న చలువే అన్నారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు పోటీలు దోహదపడతాయన్నారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో సచివాలయ స్థాయిలో జరిగే ఐదు రకాల ఆటల పోటీల్లో యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఈఓఆర్డీ రాజు, నాయకులు ఇమ్మానియేలు, క్రీడాకారులు పాల్గొన్నారు.


పాతపాడు సచివాలయ పరిధిలో క్రికెట్ పోటీలు

'కిట్స్' నూతన డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న కృష్ణచైతన్య


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు


క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మార్కాపురం: నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, అందరూ బాగుండాలని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య ఆకాంక్షించారు. శుక్రవారం కళాశాలలో నూతన సంవత్సర డైరీని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఏఓ ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పీవీ అనీల్‌కుమార్‌తోపాటు వివిధ విభాగాల హెచ్‌ఓడీలు రామ్మోహన్, కిశోర్‌బాబు, జేబీ అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

కురిచేడు: ఏపీటీఎఫ్ నూతన క్యాలెండర్, డైరీని శుక్రవారం ఎంఈఓలు ఆర్.వస్త్రాంనాయక్, సీహెచ్ సుబ్బారావుల చేతుల మీదుగా మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ బాధ్యులు షేక్ ఖాజారహంతుల్లా, ఉపాధ్యాయులు సీహెచ్ శివరామకృష్ణ, హనుమంతరావు, పాండురంగారావు, కరిముల్లా, నరేంద్రబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

పొదిలి: ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ పొదిలి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 2024 నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పఠాన్ కరీమున్ బీబీ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి పాల్గొని నూతన డైరీ, పర్సులు, లీవ్‌లెటర్ బుక్‌లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పొదిలి పట్టణ జీటీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రోజారాణి, కోటయ్య, రాష్ట్ర జీటీఏ గౌరవాధ్యక్షుడు బీవీ రెడ్డి, స్టేట్ కౌన్సిలర్ ఎం.మల్లికార్జునరావు, రవిశేఖరరెడ్డి, బీవీ పద్మ, వలి, జాఫర్ జిలాని, రంగనాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ధీరుభాయ్ అంబానీ జన్మదిన వేడుకలు


జగన్నాథపురంలో బహుమతులు అందిస్తున్న సర్పంచ్ వెంకటరెడ్డి

తర్లుపాడు: మండలంలోని జగన్నాథపురంలో రిలయన్స్ ఫౌండేషన్, ఎఫర్ట్ సంస్థల ఆధ్వర్యంలో ధీరుభాయ్ అంబానీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కిసాన్ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సర్పంచ్ గంటా వెంకటరెడ్డి పాల్గొన్నారు. తాగునీరు, సాగునీరు, పాడి పరిశ్రమల అభివృద్ధికి ఫౌండేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. మహిళలకు కుట్టు మిషన్లు, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, అల్లికలు లాంటి కార్యక్రమాలు చేపట్టి వారు స్వయం ఉపాధి పొందేలా సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి నారాయణరెడ్డి తెలిపారు. రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులు, పెట్టుబడులు తగ్గిస్తూ ప్రకృతి వ్యవసాయం చేసేలా సంస్థ తరపున కృషిచేస్తున్నట్లు వివరించారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లిక, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, లైవ్‌స్టాక్ ప్రతినిధి అనిత, సంస్థ సిబ్బంది జిగీష, శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు. ముందుగా రిలయన్స్ ఫౌండర్ ధీరుభాయ్ అంబానీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అయోధ్య అక్షతలతో ర్యాలీ


అయోధ్య అక్షతలతో ఊరేగింపు

గిద్దలూరు రూరల్: అయోధ్య రామమందిరం నిర్మాణం సందర్భంగా హిందువులు పట్టణంలోని పట్టాభిరామస్వామి ఆలయం నుంచి షరాబ్ బజారులోని వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. గిద్దలూరు నియోజకవర్గ దేవాలయాల కమిటీ కన్వీనర్ చేరెడ్డి ఎర్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి హిందువు వద్దకు అయోధ్య అక్షతలు చేరుతాయన్నారు. రామమందిరం ప్రతి హిందువు చిరకాల కోరిక అని, అది నెరవేరే సమయం దగ్గర పడటం అదృష్టంగా భావించాలన్నారు. విశ్వహిందు పరిషత్ సభ్యులు బూజుమేకల రాజు, జీవీ ప్రసాద్, వేంకటేశ్వరస్వామి ఆలయం కమిటీ అధ్యక్షుడు గంజివీరయ్య, కార్యదర్శి కంచర్ల శ్రీనివాసులు, శివాపురం మురళి పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

మార్కాపురం రూరల్: మార్కాపురం తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అసైన్డు భూములకు యాజమాన్య హక్కులు కల్పించే విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డీకేటీ రిజిస్టర్, డీకేటీ పట్టా ఆఫీస్ కాపీ, అసైన్‌మెంట్స్ కమిటీ మినిట్స్ లేకపోయినా, వెబ్‌ల్యాండ్ అడంగల్, పీఓఎల్ఆర్, పాత అడంగల్ 10(1) రిజిస్టర్ తదితర రెవిన్యూ రికార్డుల్లో సంబంధిత రైతు పేరు ఉన్న 20 ఏళ్ల క్రితం జారీ అయిన పట్టాదారు పాసుబుక్కు ఆధారంగానైనా సంబంధిత భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలిచ్చినట్లు సిబ్బందికి వివరించారు. రికార్డులు అందుబాటులో లేవనే కారణంతో అసైన్డ్‌భూమి హక్కుదారులకు యాజమాన్య హక్కులను నిరాకరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీటీ పర్వీన్, సీసీ సుబ్బారావు, కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాల వ్యతిరేక ఉద్యమం పోస్టర్ల ఆవిష్కరణ

మార్కాపురం టౌన్: మత్తు పదార్థాల వ్యతిరేక ఉద్యమ పోస్టర్లను శుక్రవారం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఐవైఎం(ఐడియల్ యూత్ మూవ్‌మెంట్) ఆధ్వర్యంలో డిసెంబర్ 29 నుంచి జనవరి 7 వరకు మత్తు పదార్థాల వ్యతిరేక ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి షేక్ ఇస్మాయిల్ సబ్‌కలెక్టర్‌కు వివరించారు. ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన వారికి విజ్ఞప్తి చేశారు. సికిందర్, అయూబ్‌ఖన్, రసూల్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూతనిద్దాం

● సబ్ కలెక్టర్ రాహుల్ మీనా


దుప్పట్లు అందిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, పక్కన గుంటక, శాసనాల

మార్కాపురం: సమాజంలో ఉన్న దివ్యాంగులకు చేయూతనిద్దామని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా కోరారు. ఎస్‌సీవీకే నిలయం (రీడింగ్ రూము) కార్యదర్శి, ఏఎంసీ మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక స్ఫూర్తి మానసిక వికలాంగుల పాఠశాలలోని విద్యార్థులకు దుప్పట్లను సబ్‌కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతలు ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా కొనసాగించాలని సూచించారు. తమ నిలయం ద్వారా ఏటా పేద విద్యార్థులకు పుస్తకాలు, పాదరక్షలు, స్కాలర్‌షిప్ అందివ్వడంతోపాటు వేసవి కాలం మొత్తం రీడింగ్ రూము వద్ద ప్రజలకోసం ఉచిత మంచినీటి సౌకర్యాన్ని అందిస్తున్నామని గుంటక సుబ్బారెడ్డి వివరించారు. అధ్యక్షుడు డాక్టర్ బాల సుబ్బారావు, సహాయ కార్యదర్శి ఎం.మోహన్‌రెడ్డి, ఈసీ సభ్యులు మూర్తి రమేష్, పఠాన్ హుస్సేన్ ఖాన్, ఎస్ వెంకటేశ్వర్లు, ఆర్‌కేజే నర్సింహం, ఎం.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సంపూర్ణంగా అమలు చేయాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

కురిచేడు: కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను సంపూర్ణంగా అమలు చేయాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి కోరారు. వికాస్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఇస్తున్న పథకాలను నేరుగా ప్రజలకు చేరవేయడంలో ఏపీ ప్రభుత్వం ముందుందన్నారు. కేంద్రం ఇచ్చే పథకాలు 50-50, 60-40, 70-30 కాకుండా నూరు శాతం రాష్ట్రాలకు ఇస్తే వాటిని ప్రజలకు చేరవేయటానికి అనుకూలంగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వాటికన్నా అధికంగా వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం ప్రజలకు అందిస్తోందన్నారు. అన్ని శాఖల అధికారులు ఆయా శాఖల ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీనివాసరావు కోరారు. అనంతరం క్యాంలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంపీటీసీలు ఆవుల లక్ష్మి వెంకటరెడ్డి, బుల్లం వెంకట నర్సయ్య, సొసైటీ ప్రెసిడెంట్ పోతిరెడ్డి నాగిరెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దూలం వెంకటరెడ్డి, ఎంపీడీఓ కుసుమకుమారి, వ్యవసాయాధికారి మధుబాబు, ఎంఈఓ వస్త్రాంనాయక్, ఏపీఎం సైమన్, మరియదాసు, వైద్యాధికారి ప్రవీణ్, కేవీకే మట్టి పరీక్ష కేంద్రం శాస్త్రవేత్త నారాయణ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

● కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌వీపీఎస్ దుర్గాప్రసాద్


మాట్లాడుతున్న ఎన్‌వీపీఎస్ దుర్గాప్రసాద్

దర్శి: నాణ్యమైన విత్తనాలకే ప్రాధాన్యం ఇచ్చి రైతులకు మేలు కలిగేలా విక్రయాలు చేపట్టాలని కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌వీపీఎస్ దుర్గాప్రసాద్ సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు, రైతు ఉత్పత్తి దారుల కంపెనీలకు, సీఈఓలు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌లకు, రైతులకు ఎస్‌ఎస్‌సీ ద్వారా విత్తనోత్పత్తి, విత్తన విక్రయంపై అవగాహన, శిక్షణ సదస్సు దర్శి కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగింది. కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌వీపీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎస్‌ఎస్‌సీ ద్వారా విత్తనోత్పత్తి చేపట్టడం రైతులకు ఎఫ్‌పీఓ, ఇతరులకు లాభదాయకమన్నారు. నాణ్యమైన విత్తనాలు రైతుల దరిచేర్చి వారికి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ విత్తన చట్టాలు విత్తన విక్రయానికి సంబంధించిన లైసెన్స్ వివరాల గురించి తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ విత్తనోత్పత్తి వాటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఉషా మాట్లాడుతూ కోత అనంతరం రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు వాటి నియమాల గురించి వివరించారు. ఎస్‌ఎస్‌సీ ఏరియా మేనేజర్ జగదీష్, ప్రొడక్షన్ అధికారులు వైడీ శ్రీనివాస్, శ్రీరాంప్రభు పాల్గొన్నారు.

వ్యవసాయ కనెక్షన్‌లు త్వరితగతిన ఇవ్వాలి


అధికారులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యనారాయణ

దర్శి: వ్యవసాయ కనెక్షన్‌లు త్వరితగతిన ఇవ్వాలిన ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ సూచించారు. స్థానిక డీఈ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఈ సత్యనారాయణ మాట్లాడుతూ రైతులందరికీ వ్యవసాయ కనెక్షన్లు త్వరితగతిన అందించామని చెప్పారు. పెండింగ్ పనులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్ విద్యుత్ బిల్ బకాయిలపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. పట్టణాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా చెట్ల కొమ్మలు కొట్టడం వంటి పనులపై సమీక్షించారు. ఇబ్బందికరంగా ఉన్న లైన్లు, పాత పడిన లైన్లు మార్పులు చేర్పుల గురించి చర్చించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు జరుగుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ఏవైనా పెద్ద సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కారం చేస్తామని ఎస్ఈ చెప్పారు. డీఈ కరీం, ఏడీ పిచ్చయ్య, ఏఈ వేణుగోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ సేవలు అభినందనీయం


విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ భూలక్ష్మి, క్లబ్ సభ్యులు

తర్లుపాడు: సమాజానికి వాసవీ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆ సంస్థ ఆర్థిక సహాయంతో మండలంలోని లక్ష్మక్కపల్లి ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలను క్లబ్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణలో డయాస్, రేకులషెడ్ నిర్మాణం, విగ్రహాల పెయింటింగ్‌కు హెచ్‌ఎం కశ్శెట్టి జగన్‌బాబు సొంత నిధులు వెచ్చించడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఎ.సుబ్బారావు, ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, సర్పంచ్ శిఖామణి, వైస్ సర్పంచ్ దాస్, స్థానిక నాయకులు మందా కొండారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, క్లబ్ సభ్యులు వెంకట చంద్రశేఖర్, నాగేంద్ర ప్రసాద్, నూరె కేశవరావు, పి.వెంకట లక్ష్మీనారాయణ, గుర్రం రామారావు, సుబ్రహ్మణ్యం, పూర్ణచంద్ర, ఉపాధ్యాయులు అబ్దుల్ షుకూర్, ఏఎంసీ చైర్మన్ పి.సుందర్, వైస్ చైర్మన్ శుభకళ తదితరులు పాల్గొన్నారు.